కలెక్టర్‌ను కలిసిన కేడీసీసీబీ చైర్ పర్సన్



చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా కలెక్టర్ పి.రాజాబాబును కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ చాంబర్‌లో రాజాబాబును దుశ్శాలువాతో సత్కరించారు. చైర్‌పర్సన్ కలెక్టర్‌తో మాట్లాడుతూ.. మహిళా సంఘాల సభ్యులకు జగనన్న కాలనీలో 70 నుంచి 80 శాతం పూర్తయిన ఇళ్ల నిర్మాణానికి రూ.2 లక్షల వరకు రుణం అందజేసేందుకు బ్యాంకు పాలకవర్గం నిర్ణయం తీసుకుందన్నారు. ఇప్పటి వరకు మహిళా సంఘాల సభ్యులకు రూ.30 నుంచి రూ.50 వేల వరకు రుణం మంజూరు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఇళ్ల నిర్మాణం పూర్తయ్యే క్రమంలో కూడా లబ్ధిదారులకు డబ్బు అవసరమవుతున్న దృష్ట్యా పాలకవర్గ సభ్యులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె కలెక్టర్‌కు వివరించారు.













దేశభక్తి భావం పెంపొందాలి



మోపిదేవిలంకలో నాయకులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

మోపిదేవిలంక(మోపిదేవి): చిన్ననాటి నుంచే పిల్లల్లో దేశభక్తిభావం పెంపొందాలని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండల పరిధిలోని మోపిదేవిలంక పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం నా భూమి–నా దేశం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సింహాద్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలని, జాతీయ జెండా ప్రతి ఇంటిపై ఎగరాలన్నారు. రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, సర్పంచ్‌లు మోర్ల జ్యోత్స్న, గరికిపాటి వెంకటేశ్వరావు, కొలసాని వెంకట కృష్ణ, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కోనేరుసెంటర్: మొక్కలు పెంపకం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని కృష్ణా యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వై.కె.సుందరకృష్ణ తెలిపారు. కృష్ణా యూనివర్సిటీలో మేరీ మట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు.

ఘంటసాల(అవనిగడ్డ): శ్రీకాకుళం పంచాయతీ శివారు సూరపనేనిపాలెంలో సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్, పంచాయితీరాజ్ ఏఈ జె నాగేశ్వరరావు జాతీయ జెండాను ఎగురవేశారు. యండకుదురులో సర్పంచ్ ఎం.పట్టాభి రామారావు, ఎంపీటీసీ ఎస్.కుమార్‌రాజా, పీఏసీఎస్ చైర్మన్ సిద్ధినేని రాము, ఈవో శివరామకృష్ణ, దేవరకోటలో సర్పంచ్ మద్దాల వెంకటేశ్వరరావు, ఈవో కృష్ణవేణి జాతీయ జెండాను ఎగురవేశారు. మాజీ సైనికోద్యోగుల కుటుంబ సభ్యులను సత్కరించారు.

రావివారిపాలెం(మోపిదేవి): రావివారిపాలెంలో కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల వారి ఆధ్వర్యంలో ఇండియన్ ఆర్మీలో సేవలు అందించిన ఎయిర్‌క్రాఫ్ట్‌మెన్ నందిగం జనార్దనరావును సత్కరించారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ బి.నవీన్, ఆదర్శ రైతు జొన్నలగడ్డ పిచ్చేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

కోడూరు: కోడూరు పంచాయతీ కార్యాలయం వద్ద జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, సర్పంచ్ వెన్నా షైనీలు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దిమ్మెను ఆవిష్కరించారు. ఎంపీడీవో పాండురంగారావు, తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా, ఎంఈవో టి.ఎం.రామదాసు తదితరులు పాల్గొన్నారు.

పెడన: స్వాతంత్ర్య అమర వీరులను స్మరించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అన్నారు. జోగానందరావు కాలనీలోని ఎంపీపీ పాఠశాలలో శిలాఫలకాన్ని ఆవిష్కరించి జాతికి అంకితం చేశారు. మున్సిపల్ కమిషనర్ బి.మహేంద్ర, మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమ సంఘ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కొంకేపూడి పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ దావు బైరవలింగంతో పాటు పలువురు శిలాఫలకాన్ని ఆవిష్కరించి జాతికి అంకితం చేశారు. ఉరివి, ఉప్పకలువగుంట గ్రామాల్లో వేడుకలు జరిగాయి.

వక్కపట్లవారిపాలెం(నాగాయలంక): మండలంలోని వక్కపట్లవారిపాలెం, పర్రచివర, నాచుగుంట, ఎదురుమొండి, ఈలచెట్లదిబ్బ గ్రామాల్లో నా భూమి–నా దేశం కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. వక్కపట్లవారిపాలెంలో సర్పంచ్ అంబటి శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కృత్తివెన్ను: నిడమర్రు పంచాయతీలో జెండా వందనం, ప్రతిజ్ఞ, వీరులకు వందనం కార్యక్రమాలు నిర్వహించారు. ఎంఈవో ప్రసాద్, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

బంటుమిల్లి: మండలంలోని సాతులూరు, పెందుర్రు, పెదతుమ్మిడి, చినతుమ్మిడి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటి, జాతీయ పతాకాలు ఎగురవేశారు. శిలాఫలకాలను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీపీ వెలివెల చినబాబు, తహసీల్దార్ ఎంవీ.సత్యనారాయణ, సర్పంచ్‌లు అర్జా యశోదమ్మ, జి.బాలస్వామి, ఎంపీటీసీ మాదాసు లక్ష్మీశకుంతల, ఏఎంసీ డైరెక్టర్ మారుబోయిన నాంచారమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల విమర్శలు సిగ్గుచేటు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

కోసూరువారిపాలెం(మోపిదేవి): రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ ఇళ్ల పథకం ద్వారా గృహ నిర్మాణాలు చేస్తుంటే ఓర్వలేక టీడీపీ నాయకులు విమర్శలు చేయడం సిగ్గుచేటని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండల పరిధిలోని కోసూరువారిపాలెంలో జగనన్న లే అవుట్‌లో 10 మంది ఎస్టీల ఇళ్ల నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ అనుచరులు శంకుస్థాపనకు, గృహప్రవేశాలకు తేడా తెలియకుండా విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కృష్ణాడెల్టా ఆధునీకరణకు అప్పటి ప్రభుత్వం రూ.165 కోట్లు అవుట్ పాయిల్ స్లూయిజ్ కింద నిధులు మంజూరు చేస్తే, కమీషన్‌కు కక్కుర్తిపడి కాలువపై వంతెనలు నిర్మించి నిధులు దండుకున్నారని విమర్శించారు. నాటి అవినీతిపై చర్చకు ఆధారాలతో ఎక్కడకైనా వస్తానని, మీకు ధైర్యం ఉంటే నా సవాల్‌ను స్వీకరించాలన్నారు. రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, సర్పంచ్‌లు కోసూరు అనూష, మోర్ల జ్యోత్స్న, గరికిపాటి వెంకటేశ్వరావు, కొలసాని వెంకట కృష్ణ, మండల సచివాలయ కన్వీనర్ శివనాగమల్లేశ్వరావు, ఎంపీటీసీ రాజేష్‌బాబు, పీఏసీఎస్ చైర్మన్లు, నాయకులు, అధికారులు, లబ్ధిదారులు ఉన్నారు

సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్

పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి అన్నారు. 3వ డివిజన్‌లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని డెప్యూటీ మేయర్ శీలం భారతితో కలిసి ఆయన నిర్వహించారు. ఇంటి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాల వారికి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల వివరాలతో ముద్రించిన బుక్‌లెట్లను అందజేశారు. కార్యక్రమంలో భాగంగా మాచవరంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి కిట్టు, భారతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గంగానమ్మ ఆలయంలో పూజలు చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, మాజీ కౌన్సిలర్లు శీలం బాబ్జి, చిటికిన నాగేశ్వరరావు, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కోకనారాయణపాలెం సర్పంచ్ ఏకగ్రీవం



పెడన/గూడూరు: గూడూరు మండలం కోకనారాయణపాలెం సర్పంచ్ పదవికి ఉప ఎన్నిక సందర్భంగా దాఖలైన ఏడు నామినేషన్లలో ఆరు నామినేషన్లు ఉపసంహరణ కావడంతో ఉన్న ఒక్క నామినేషన్ అభ్యర్థి బండి అంజలిదేవి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. దీంతో ఆమె గూడూరు మండల నాయకులతో కలిసి పెడనలోని మంత్రి కార్యాలయంలో మంత్రి జోగి రమేష్ ఘనంగా సన్మానించి అభినందించారు. జక్కంచర్ల 1వ వార్డులో ఆత్మూరి రజని, ఆకులమన్నాడు 2వ వార్డులో శాయన రమాభ్రమరాంబ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పోలవరంలో మాత్రం ఎన్నికలు జరగనుంది.

పెడన: మండల పరిధిలోని కొంగంచర్ల సర్పంచ్ ఉపఎన్నికకు సంబంధించి దాఖలైన నాలుగు నామినేషన్లకు సంబంధించిన నలుగురిలో ఇద్దరు తమ నామినేషన్లను సోమవారం ఉపసంహరించుకున్నారు. కాకర్లమూడి వార్డు సభ్యుల బరిలో ఇద్దరు నిలిచారు. ఈ నెల 19న పోలింగ్ నిర్వహించనున్నారు.

గూడూరు: గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని కృష్ణాజిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా పరిశీలన కార్యక్రమాన్ని ఆయన సమీక్షించారు. తహసీల్దార్ విజయప్రసాద్, హెచ్‌ఎం డి.పుష్పలత, వీఆర్వో కరీముల్లా పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆనందోత్సాహాలు

లక్ష్మీపురం(చల్లపల్లి): రాష్ట్ర ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఇంటింటా ఆనందోత్సాహాలు వెల్లివిరిస్తున్నాయని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. లక్ష్మీపురం గ్రామ సచివాలయం -2 పరిధిలోని పుచ్చగడ్డలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం జరిగింది. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు 400ల ఇళ్లకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సీఎం జగన్ చొరవతో విద్య, వైద్య రంగాలు బలోపేతమయ్యాయన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు గమనించిన ప్రజలు మరోసారి జగన్ పరిపాలన కోరుకుంటున్నారని తెలిపారు. సీనియర్ నాయకులు తుమ్మల వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, సర్పంచ్‌లు కొల్లూరి కోటేశ్వరరావు, తోట శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్లు శీరం వెంకట సత్యనారాయణ, పాగోలు ఫణి, అరజా శివశంకర్, ఎంపీటీసీ నూకల వెంకటేశ్వరరావు, మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు బొందలపాటి లక్ష్మి, ఫుడ్ కమిటీ డైరెక్టర్ కుందేటి కోటేశ్వరరావు, ఎంపీడీవో సీహెచ్.చినరాట్నాలు, ఎంఈవో పి.వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిత్ర ప్రదర్శన

మచిలీపట్నంటౌన్: 1947 ఆగస్టు 14వ తేదీ భజన జ్ఞాపకాల దినం సందర్భంగా స్థానిక కేంద్రీయ విద్యాలయంలో సోమవారం నాటి చిత్రాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకుంది. విద్యాలయం సాంఘికశాస్త్ర ఉపాధ్యాయురాలు డి.అరుణకుమారి నేతృత్వంలో విద్యార్థులు ఆనాటి ప్రజలు అనుభవించిన భయానక ఘటనలను వివరిస్తూ చిత్రప్రదర్శన చేశారు. విద్యాలయం ప్రిన్సిపాల్ జాలాది సత్యనారాయణ మాట్లాడుతూ 1947 ఆగస్టు 14 చరిత్రలో మరువలేని రోజన్నారు. ప్రధానోపాధ్యాయురాలు గ్లోరి స్వరూపారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బంటుమిల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దేశభక్తి గీతాలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు జరిపారు. స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.జగన్‌మోహన్‌రావు వివరించారు. కార్యక్రమాల్లో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేనేత రంగాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకోండి

పెడన: కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలతో చేనేత రంగం కుదేలవుతుందని, చేనేత రంగాన్ని పరిరక్షించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు బండారు ఆనందప్రసాద్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరిని విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఆమెను కలిసి సంఘ నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. చేనేతపై జీఎస్టీ రద్దు చేయడం, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రోత్సహించడం ద్వారా చేనేత రంగాన్ని పరిరక్షించడం కుదురుతుందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్, కేంద్ర జౌళి శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో చేనేత సమస్యలపై మాట్లాడేందుకు అపాయింట్‌మెంట్ ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. పురంధేశ్వరిని కలిసిన వారిలో సంఘ నాయకులు వెంకటరాయుడు, రమణ మహేష్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

రిటైర్డ్ హోంగార్డుకు చెక్కు అందజేత

కోనేరుసెంటర్: హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ ఈ ఏడాది మార్చి 8వ తేదీన పదవీ విరమణ పొందిన ఎస్.ప్రభావతికి మంజూరైన రూ.20,520ల సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ వన్డే కాంట్రిబ్యూషన్ చెక్కును జిల్లా ఎస్పీ పి.జాషువా సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సుదీర్ఘకాలం పాటు హోంగార్డుగా పోలీసుశాఖకు విశిష్ట సేవలను అందించి పదవీ విరమణ పొందిన ప్రభావతికి పోలీసు శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. శాఖాపరంగా ఎప్పుడు ఎలాంటి అవసరం వచ్చినా స్వయంగా తనను కలవవచ్చని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హరిబాబు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

మచిలీపట్నంటౌన్: భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు అంతా సిద్ధమైంది. నగరంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, సంస్థల వద్ద వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. నగరంలోని ప్రధాన కూడలిగా ఉన్న కోనేరుసెంటరు, నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద జెండా వందనం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కోనేరుసెంటరు సర్కిల్‌లో వాటర్ ఫౌంటేన్‌కు మరమ్మతులు చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయానికి మామిడి తోరణాలు కట్టి ముస్తాబుచేశారు. నగరంలోని ప్రతి ఇంటిపై జాతీయజెండా ఎగురవేసేందుకు వలంటీర్లు జెండాలను పంపిణీ చేశారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

గూడూరు: మండలంలోని రాయవరం గ్రామంలో విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన ఊసా పాండురంగారావుకు చెందిన తాటాకు ఇల్లు సోమవారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో ఇల్లు, ఇంటిలోని సామాను మొత్తం కాలిబూడిదైంది. స్థానికులు మంటలను అదుపు చేశారు. బాధితులను సర్పంచ్ నందం మల్లీశ్వరి పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ కోళ్ల వీరవెంకట బాలకృష్ణ, నందం రవికిరణ్ నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు.

రామలింగేశ్వరునికి అభిషేకాలు

నాగాయలంక: స్థానిక శ్రీరామ పాదక్షేత్రం వద్ద కృష్ణానదిలోని మండపంలో శ్రీగంగ పార్వతీ సమేత రామలింగేశ్వర శివలింగానికి సోమవారం భక్తులు విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. బ్రహ్మశ్రీ అంబా సాయికిరణ్ శర్మ బ్రహ్మత్వంలో క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు పర్యవేక్షణలో అభిషేకించారు. అనంతరం కృష్ణవేణమ్మ విగ్రహానికి హారతులిచ్చారు.

నేడు సచివాలయ కన్వీనర్లకు బీమా నమోదు

అవనిగడ్డ: నియోజకవర్గంలోని 77 సచివాలయాల పరిధిలోని సచివాలయ కన్వీనర్లకు మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద బీమా నమోదు, అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది యోగేష్ తెలిపారు. ప్రతి సచివాలయ పరిధిలో ముగ్గురు కన్వీనర్లు ఉన్నారని, ప్రతి కన్వీనర్‌కు రూ.10 లక్షల వ్యక్తిగత బీమాకు నమోదు చేస్తామన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే కార్యక్రమానికి సచివాలయ కన్వీనర్లందరూ అవసరమైన సర్టిఫికెట్లతో రావాలని కోరారు.

ఎరువులు ఎమ్మార్పీకే విక్రయించాలి

చల్లపల్లి: యూరియా, కాంప్లెక్స్ ఇతర ఎరువులు ఎమ్మార్పీ ధరకు మించి విక్రయిస్తే ఎఫ్‌సీఓ 1983 చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని మొవ్వ ఏడీఏ ఎస్.శ్యామల హెచ్చరించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఎరువులు, యూరియా డీలర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. చల్లపల్లి మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో 146 మెట్రిక్ టన్నుల యూరియా, మార్కెట్‌లో 486 మెట్రిక్ టన్నుల యూరియా సిద్ధంగా ఉందని తెలిపారు. ఏవో జి.సాయి సింధు, డీలర్లు, పీఏసీఎస్ సీఈవోలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

కోడూరు: మండలంలోని స్వతంత్రపురం ప్రాథమిక పాఠశాలలో పని చేసి ఇటీవల బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఉపాధ్యాయులకు సోమవారం తల్లిదండ్రులు, విద్యార్థులు సన్మానం నిర్వహించారు. ఉపాధ్యాయులు మన్నె ప్రేమ్‌చంద్, వేముల రమేష్‌బాబు బదిలీపై రామకృష్ణాపురం ఎంపీయూపీ, కొత్తపాలెం ఎంపీపీ పాఠశాలకు, అప్పికట్ల సాంబశివయ్య పదోన్నతిపై విశ్వనాథపల్లి ఎంపీయూపీకు బదిలీపై వెళ్లారు. ప్రభుత్వ స్కూళ్లపై తల్లిదండ్రులకు బలమైన నమ్మకం ఏర్పడాలనే చేశారని కొనియాడారు. ఉపాధ్యాయుడు ప్రేమ్‌చంద్ పాఠశాలకు రూ.2.50 లక్షల విలువ చేసే స్థలాన్ని విరాళంగా అందించారని, మిలిగినవారు కూడా స్ఫూర్తిగా తీసుకోవాలని ఎంఈవో అన్నారు. ఎంఈవో-2 శ్రీనివాసరావు, కాంప్లెక్ చైర్మన్ ఆలా వెంకటరమణ, హెచ్‌ఎం నగరాజకుమారి పాల్గొన్నారు.

77వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

ఎల్.ఐ.సి. ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్

ది 06-02-2023 నుండి డిపాజిట్లపై అమలులో ఉన్న వడ్డీరేట్లు

15 రోజుల నుండి 30 రోజుల వరకు	- 6.00%
31 రోజుల నుండి 3 నెలలలోపు	- 6.25%
3 నెలల నుండి 6 నెలలలోపు	- 7.00%
6 నెలల నుండి 1 సంవత్సరం లోపు	- 7.25%
1 సంవత్సరము నుండి 3 సంవత్సరముల లోపు	- 7.75%
3 సంవత్సరముల నుండి 5 సంవత్సరములలోపు	- 7.00%
5 సంవత్సరములు ఆపైన	- 6.50%

60 సం॥ల వయస్సు నిండిన ఖాతాదారులకు డిపాజిట్లు 0.5% ఎక్కువ వడ్డీ కలదు.

బ్యాంక్ పాలకవర్గము

CEO





